www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 9 ఏప్రిల్ 2025

గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని, పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి లీటరుకు రూ.2 భారం తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర రూ.60 పెంచడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచి వారి నడ్డి విరిచే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఆయన కోరారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినందున అందుకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సర్వజన ఆసుపత్రిలో.. సర్వం కష్టాలే..!

- వీల్‌చైర్, స్ట్రెచర్ కోసం పాట్లు
- కుటుంబికులే రోగులను తీసుకెళ్లాల్సిన దుస్థితి
- బర్త్ సర్టిఫికెట్ కావాలంటే ఎండలో మాడాల్సిందే
- రిఫరల్ పేరుతో రోగులకు ముప్పతిప్పలు
- వైద్యుల కొరతపై పట్టించుకోని ప్రభుత్వం

రోగిని నడిపించుకుని తీసుకెళ్తున్న బంధువులు

రోగిని స్ట్రెచర్‌పై ఎక్కిస్తున్న బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. బోధనాసుపత్రిగా మారిన తర్వాత ఆసుపత్రి నిర్వహణను ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. జిల్లా ఆసుపత్రిగా ఉండగా ఎంతోగొప్పగా సేవలందించిన ఆసుపత్రి ఇప్పుడు సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రికి ప్రతిరోజూ వెయ్యి నుంచి 1200 మంది వరకూ రోగులు (ఓపి) వస్తుంటారు. ఇన్‌పేషెంట్స్‌గా దాదాపు 300 వరకూ బెడ్స్ ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి ఏలూరు సర్వజన ఆసుపత్రికి రోగులు వైద్యసేవల కోసం వస్తుంటారు. జనం నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఆసుపత్రిలో సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఆసుపత్రిలో ప్రధాన విభాగమైన క్యాజువాలిటీ (అత్యవసర వైద్యం) వద్ద రోగులు పడుతున్న ఇబ్బందులు రోజురోజుకీ పెరుగుతున్న పరిస్థితి ఉంది. అత్యవసర కేసులన్నీ క్యాజువాలిటీకి వస్తుంటాయి. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత ఆసుపత్రిలో బెడ్ కేటాయించడం, లేదంటే విజయవాడ, గుంటూరు ఆసుపత్రులకు రిఫర్ చేయడం వంటివి జరుగుతుంటాయి. రోడ్డు ప్రమాద కేసుల నుంచి అన్ని అత్యవసర కేసులనూ క్యాజువాలిటీలోనే చూడాలి. జిల్లాలో ఏమూల నుంచి అంబులెన్స్‌లో ఏ రోగిని తీసుకొచ్చినా ముందుకు క్యాజువాలిటీలోనే పరీక్షించాలి. అలాంటి అత్యవసర విభాగం వద్ద రోగులను తరలించే స్ట్రెచ్చర్, వీల్‌ఛైర్ కోసం రోగులు పడుతున్న పాట్లు అత్యంత దారుణమని చెప్పొచ్చు. ఇక్కడ ఒక వీల్‌ఛైర్, రెండు స్ట్రెచ్చర్లు మాత్రమే ఉన్నాయి. క్యాజువాలిటీలో ప్రాథమిక వైద్యం అనంతరం రోగిని వార్డ్‌కు వీల్‌ఛైర్‌పై తరలించాలంటే అక్కడ వీల్‌ఛైర్ ఉండదు. స్ట్రెచ్చర్ల పరిస్థితీ అంతే. నిబంధనల ప్రకారం అక్కడ పని చేసే సిబ్బందినే రోగులను వీల్‌ఛైర్, స్ట్రెచ్చర్లపై తరలించాలి. అయితే సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో రోగుల కుటుంబీకులే వీల్‌ఛైర్, స్ట్రెచ్చర్లపై రోగులను తరలించుకోవాల్సిన దుస్థితి ఉంది. అదేమని అడిగితే తమ రోగిని పట్టించుకోరనే భయం అందరినీ వెంటాడుతోంది. క్యాజువాలిటీ వద్ద సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా ఆసుపత్రి అధికారులు పట్టించుకోని దుస్థితి నెలకొంది.

వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లేదీ బంధువులే

అధికారులు ఫ్యాన్ కింద.. జనం ఎండలో..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఎంసిహెచ్ బ్లాక్ (తలీ బిడ్డల ఆసుపత్రి) ఉంది. ఇక్కడ ప్రతిరోజూ 150 మందికిపైగా గర్భిణులు అవుట్ పేషెంట్స్‌గా వస్తుంటారు. సరాసరిన రోజుకు 15కుపైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇక్కడ పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ ఆసుపత్రిలోనే తీసుకోవాలి. అందుకోసం ప్రత్యేక గదికేటాయించారు. బర్త్ సర్టిఫికెట్ తీసుకునేందుకు వస్తున్న తల్లిదండ్రులను ఆసుపత్రి సిబ్బంది అత్యంత దారుణంగా చూస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఆసుపత్రి లోపల ఫ్యాన్ కింద సిబ్బంది కూర్చుని సర్టిఫికెట్ కోసం వచ్చినవారిని ఎండలో నిలబెడుతున్నారు. గది బయట కిటికీ వద్దే వీరు నిలబడాలి. అక్కడ నిలబడేందుకు సైతం వీలులేకుండా ఉంది. అక్కడ అడ్డంగా ఇనుప కడ్డీలు ఉంటాయి. గతంలో ప్రత్యేక గది ఏర్పాటు చేసి అక్కడ బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చేవారు. ఇన్‌ఫెక్షన్ పేరుతో బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నరకం చూపిస్తున్నారంటూ వచ్చిన వారంతా గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ పని చేసే సిబ్బంది సైతం రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని అంతా చెబుతున్నారు. జనాన్ని ఎండలో నిలబెట్టడంపై తీవ్ర విమర్శలు రావడంతో ఏదో నామకహ అన్నట్లు ఒక బరకం వేలాడదీశారు. జనాన్ని ఎండలో నిలబెట్టి, సిబ్బంది చక్కగా ఫ్యాన్ కింద కూర్చుని పని చేయడం ఏమిటో అర్థం కాని పరిస్థితి. దీనిపై ఆసుపత్రి అధికారులు సైతం సరిగా పట్టించుకోని పరిస్థితి ఉంది. బర్త్ సర్టిఫికెట్లు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని చెప్పొచ్చు.

రిఫర్ పేరుతో నరకం

జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఎలాంటి క్రిటికల్ కేసులనైనా ఆసుప్రతి వైద్యులు ఛాలెంజ్‌గా తీసుకునేవారు. బోధనాసుపత్రిగా మారిన తర్వాత అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. చిన్నపాటి కేసులను సైతం విజయవాడ, గుంటూరు రిఫర్ చేసేస్తున్నారు. తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇది ఆసుపత్రికి వచ్చే రోగులకు పెనుశాపంగా మారింది. అంతదూరం వెళ్లలేక ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే జేబు గుల్లవుతోంది. జిల్లా ఉన్నతాధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోని పరిస్థితి ఉంది.

వైద్యుల కొరతపై పట్టని ప్రభుత్వం

సర్వజన ఆసుపత్రికి వచ్చేవారంతా సామాన్య ప్రజానీకమే. ఆర్థికంగా ఖర్చు చేసే స్తోమత లేనోళ్లు ఇక్కడకు వస్తుంటారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన వైద్యులు సైతం ఇక్కడ లేకుండా పోయారు. ఎంసిహెచ్ (తల్లీ బిడ్డల) బ్లాక్‌లో 16 మంది గైనకాలజిస్టులు ఉండాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. విభాగాల వారీగా 97 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 32 మంది మాత్రమే ఉన్నారు. దీంతో రోగులకు సరైన వైద్యసేవలు అందని పరిస్థితి నెలకొంది. ఎంపీ, ఎంఎల్ఎ, కలెక్టర్‌తో కూడిన ఆసుపత్రి కమిటీ సైతం ఇక్కడ సమస్యలపై సరైన దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాల్సిందే

సిపిఎం, సిపిఐ, సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

బుట్టాయగూడెంలో..

జంగారెడ్డిగూడెంలో..

నూజివీడులో..

ఏలూరులో సిఐటియు ఆధ్వర్యాన..

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన బుట్టాయగూడెంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్‌ను మహిళ నెత్తిపై పెట్టుకుని భారం మోయలేకున్నామని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గ్యాస్ ధర పెంపు గోరుచుట్టుపై రోకలిపోటులా మారిందన్నారు. మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలపై మోపిన భారాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చంద్రు బుల్లమ్మ, సోయం శ్రీనివాస్, మడకపాటి అనూష, మరియమ్మ, పంతులమ్మ, కుమారి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పెంచిన గ్యాస్ ధరల తగ్గించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతున్న పరిస్థితుల్లో దేశంలో గ్యాస్ ధర పెంపు దారుణమన్నారు. మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ ప్రజలు ఇప్పటికే నిత్యావసరాల ధరల భారంతో సతమతమవుతుంటే వాటిని తగ్గించకపోగా గ్యాస్ భారం మోపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.మాబు, వి.గోపీ, ఎఆర్.చంద్రరావు, బి.శివయ్య, డి.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పెంచిన గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక 15వ వార్డులో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి ప్రజలపై భారాలు వేయటం, సంపన్నులకు దోచిపెట్టడం తప్ప మరొకటి లేకుండా పాలన సాగిస్తుందని విమర్శించారు. పెట్రోల్ గ్యాస్ ధరను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శోభనాద్రి, కె.శ్రీను, ఆంజనేయులు, రంగారావు, కల్పన పాల్గొన్నారు.

నిడమర్రు: పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన నిడమర్రు, భువనపల్లిలో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పెట్రోలు, గ్యాస్ ధరలు పెంచుతుందని విమర్శించారు. తక్షణం పెంచిన ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, తోపు కృష్ణ, దారపోయిన గాంధీ, గిద్ద నాగేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

సిఐటియు ఆధ్వర్యాన

ఏలూరు అర్బన్: వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50కు పెంచుతూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ బొమ్మ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ ధరను పెంచడం అంటే మోడీ ప్రభుత్వం మహిళలకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. చంద్రబాబు వెంటనే దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు జోక్యం చేసుకుని గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించేలా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ ధర్నాకు బి.సోమయ్య, జె.గోపీ, సిహెచ్.అమరకుమార్, జి.కోటేశ్వరరావు, టి.అప్పారావు నాయకత్వం వహించారు.

సిపిఐ ఆధ్వర్యాన

పెంచిన గ్యాస్ సిలిండర్ ధర రూ.50 వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ మన పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక వలె మన రాష్ట్రంలోనూ గ్యాస్ సిలిండర్ రూ.500కే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, నాయకులు కృష్ణమాచార్యులు, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యాన స్థానిక గణపతి సెంటర్ నుంచి మెయిన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడగా పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ, నేతలు వెలగల నాని, మట్ట రామకృష్ణ, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. సిఎం ఈ నెల 11న నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్న దృష్ట్యా పర్యటనా ఏర్పాట్లను మంగళవారం ఆయన కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సిఎం ఆగిరిపల్లిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాలను ఆగిరిపల్లిలో నిర్వహిస్తారని, దానిలో చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. బలహీనవర్గాల పని ప్రదేశానికి వెళ్లి వారి సమస్యలను సిఎం అడిగి తెలుసుకుంటారన్నారు. చేతివృత్తులు చేసుకునే శాలివాహనులు, రజకులు వంటి బలహీనవర్గాలకు వారికి అవసరమైన పనిముట్లు అందించడంతోపాటు వారి సమస్యలను తెలుసుకుని వారి ఆర్థికాభివృద్ధికి రుణాలు అందజేస్తారన్నారు. నియోజకవర్గంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి పార్థసారథి చెప్పారు. ఈ సందర్భంగా అగిరిపల్లి శివారు వడ్లమానులో హెలీప్యాడ్, బహిరంగ సభకు సంబంధించి అధికారులు ప్రతిపాదించిన ప్రదేశాలను మంత్రి పరిశీలించారు. వేసవి దృష్ట్యా బహిరంగ సభలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా తాగునీరు, టెంట్లు, కుర్చీలు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్, బహిరంగ సభల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, తహశీల్దార్ ప్రసాద్, ఎంపిడిఒ వేణు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, శ్రీనివాస్, ఎ.సతీష్, గణేష్, నాని, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టర్, జెసితో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

అకాల వర్షం

పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలో మంగళవారం సాయంత్రం మళ్లీ గాలులతో భారీ వర్షం కురిసింది. మండు వేసవిని తలపిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ మండుటెండ రావడంతో ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనుకోని రీతిగా సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, కారు మబ్బులు కొమ్ముకొని జోరు వర్షం కురిసింది. దీంతో నూజివీడు బస్టాండ్, రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం వీచిన ఈదురు గాలులకు మామిడికాయలు రావడంతో రైతన్నలు ఇప్పటికే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మరలా గాలి దుమారం రావడంతో కొద్దిపాటి మామిడికాయలు కూడా నేలరాలిపోయి రైతన్నలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని వాపోతున్నారు.

వరదను తలపించిన వర్షపు నీరు..

నూజివీడు పట్టణ పరిధిలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో వరదను తలపిస్తూ వర్షపు నీరు రోడ్లపై నిలిచింది. పట్టణంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో నీరు ప్రవహించే దారి లేక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద రోడ్లపై నిలిచింది. బస్టాండ్ వద్ద బస్సులు దిగే సమయంలో ప్రయాణాలకు వెళ్లే ప్రజలు బస్సు ఎక్కేందుకు నిలిచిన నీటి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని డ్రెయినేజీలలో చెత్తాచెదారం నిండి ఉండడం వల్ల వర్షపు నీరు ప్రవహించే దారి లేక రోడ్లపైకి వరద మాదిరి చేరుకుంది. బస్టాండ్ సమీపంలోని డ్రెయినేజీలను పరిశుభ్రం చేసి వర్షపు నీరు ముందుకు ప్రవహించేలా చేయాలని సమీపంలోని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

నూజివీడు టౌన్ : బస్టాండ్ వద్ద నిలిచిన వర్షపునీరు

కొయ్యలగూడెం : నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండల వ్యాప్తంగా భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ గాలుల ధాటికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడినప్పటికీ, రైతులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికి వచ్చిన మామిడి, మిరప వంటి పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. ఈదురుగాలుల తీవ్రతకు మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి. ఈ సహజ విపత్తి వల్ల వ్యవసాయ రంగంపై ఆకస్మిక దెబ్బ తగిలినట్లు స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు కంట్రోల్ రూమ్ సాయం తీసుకోండి

గుండుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం అమ్మకాల్లో రైతులు తమకు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే, కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సహాయ సహకారాలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తెలిపారు. గుండుగొలను రైతుసేవా సహకార సంఘం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి ధాన్యం సేకరణకు సిద్ధం చేసిన గోనె సంచుల నాణ్యతను పరిశీలించారు. రైతుల సమక్షంలో గోనెసంచుల కట్టలను ర్యాండమ్‌గా చెకింగ్ చేయాలని కోరారు. గత సీజన్‌కు దిగుమతి చేసుకొని ప్రస్తుతం పాడై నిరుపయోగంగా మండలంలో వేలాదిగా ఉన్న గోనె సంచులను సంబంధిత ఏజెన్సీలకు తిరిగి పంపాలని ఆదేశించారు. అనుకోని ఇబ్బందులు ఏర్పడితే రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్లు రైతు సేవా కేంద్రాల వద్ద సిద్ధం చేశామన్నారు. భీమడోలు మండలం నుంచి ప్రస్తుత సీజన్‌కు తొలిసారిగా ధాన్యం రవాణా చేస్తున్న లారీకి ఎంఎల్ఎ, జెసి జెండా ఊపి పంపారు. ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లులకు తరలించుకునే ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందన్నారు. వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా మాట్లాడుతూ రైతులు భూసారం పెంచుకునేందుకు పచ్చిరొట్ట పైరులు సాగు చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల వద్ద రాయితీపై అందించేందుకు జీలుగు, జనుము విత్తనాలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజకుమారి, వ్యవసాయాధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ధాన్యం లారీని పంపుతున్న ఎంఎల్ఎ, జెసి

మోడల్ స్కూల్‌గానే కొనసాగించాలని వినతి

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల-1ను మోడల్ స్కూల్‌గానే కొనసాగించాలని బొర్రంపాలెం సామాజిక కార్యకర్త గుండె పాండురంగ కోరారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను అంగన్‌వాడీ పిల్లలతో కలిపి 1, 2 తరగతి వరకు నడిపే పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్ గాను, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చే ప్రక్రియను మొదలు పెట్టారన్నారు. ఈ క్రమంలో బొర్రంపాలెం ప్రాథమిక పాఠశాల-1 గత యాభై సంవత్సరాల పైబడి ఇక్కడ కొనసాగుతుందని, ఇక్కడ ఫౌండేషన్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల 3, 4, 5 తరగతుల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. మా పిల్లల భవిష్యత్ దృష్ట్యా సంబంధిత అధికారులు స్పందించి బొర్రంపాలెం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల-1ను మోడల్ స్కూల్‌గా కొనసాగేలా ఉత్తర్వులు జారీచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుండె గణపతి, గుండె నాగేంద్ర పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతిని అందజేస్తున్న పాండురంగ

బాబి ఐస్ క్రీమ్ పార్లర్ ప్రారంభం

చింతలపూడి : చింతలపూడి పట్టణంలోని పాత చింతలపూడిలో బాబి ఐస్ క్రీమ్ పార్లర్‌ను నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగారోషన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాపారం బాగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతదేహంతో రహదారిపై రాస్తారోకో

స్తంభించిన ట్రాఫిక్

ముదినేపల్లి : తనుశ్రీ మృతికి కారణమైన ఆమె భర్త అనిల్ కుమార్‌ను తమకు అప్పగించాలంటూ మృతురాలి బంధువులు, గ్రామస్తులు, దళితులు పెద్ద ఎత్తున మంగళవారం ముదినేపల్లి- బంటుమిల్లి రహదారిలో మండలంలోని వడాలి సెంటర్లో తనుశ్రీ మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ తనుశ్రీని ఆమె భర్త అనిల్ కుమార్ హతమార్చి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించడన్నారు. అనిల్ కుమార్‌ను తీసుకొచ్చి తమకు అప్పగించాలంటూ, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున దళితులు నినాదాలు చేస్తూ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో గుడివాడ-భీమవరం రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు, బంధువులకు అప్పగించారు. వడాలి సెంటర్‌లో మృతదేహంతో రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో పోలీసులకు, దళితులకు మధ్య వాగ్వాదాలు జరిగాయి. కైకలూరు సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో కైకలూరు, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి మండలాల ఎస్ఐలు, పోలీసులు చేరుకున్నారు. ఆందోళనకారులతో రాస్తారోకో విరమించాలని ఎంతసేపు సంప్రదింపులు జరిగినా విరమించలేదు. దీంతో సిఐ రవికుమార్ డిఎస్‌పి శ్రావణ్ కుమార్‌తో ఫోన్లో ఆందోళనకారులతో మాట్లాడించారు. అనిల్ కుమార్‌కు కఠిన శిక్ష విధిస్తామని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని, ఎలాంటి అపోహలు వద్దని డిఎస్‌పి హామీ ఇచ్చారు. సిఐ రవికుమార్, తహశీల్దార్ పవన్ కుమార్ తనుశ్రీ మృతికి కారణమైన అనిల్ కుమార్‌ని కఠినంగా శిక్షిస్తామని, గ్రామ బహిష్కరణ చేస్తామని లిఖితపూర్వకంగా ఆందోళన చేస్తున్న దళితులకు హామీ ఇవ్వడంతో దళితులు రాస్తారోకో విరమించారు. ఇప్పటికే అనిల్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. అప్పటికే భారీగా నిలిచిపోయిన వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఈ రాస్తారోకోలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళితులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వడాలి సెంటర్లో రాస్తారోకో చేస్తున్న దళితులు

నినదిస్తున్న ఉపాధి కూలీలు, వ్యకాస నేతలు

ఉపాధి బకాయిలు చెల్లించాలని ఆందోళన

..మెయిన్ 3వ పేజీలో

కోకో గింజలకు మద్దతు ధర కల్పించాలి

తడిచిన గింజలను పరిశీలించిన రైతుసంఘం నేతలు

జీలుగుమిల్లి : కోకో గింజలకు మద్దతు ధర కల్పించాలని రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దర్భగూడెం గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిచిన కోకో గింజలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ కోకో గింజలకు మద్దతు ధర రూ.900 కల్పించాలని డిమాండ్ చేశారు. తడిసిన కోకో గింజలనూ అదే ధరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు దాసరి జానకి రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే పరిశీలన

ముసునూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వేలో వచ్చిన లోపాలను మరలా సర్వే చేయించాలని ఆదేశాలు జారీ చేసినట్లు మండల రెవెన్యూ తహశీల్దార్ కె.రాజకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లవల్లి గ్రామంలో రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లవల్లి గ్రామంలో గతంలో రీ సర్వే చేసినప్పటికీ కొందరు రైతులు సరిగ్గా చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని రైతులకు అనుకూలంగా సర్వే చేసే విధంగా జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో మరలా రీ సర్వే చేస్తున్నట్లు తెలియజేశారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

ముసునూరు : మండలంలోని చెక్కపల్లి, రమణక్కపేట గ్రామంలోని పంటకాలువలు, పారంపాండ్, పశువుల నీటితొట్లను ఎపిఒ టి.రోజ్‌లీలా పరిశీలించారు. అనంతరం రోజ్‌లీలా మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేస్తున్న కూలీలతో మాట్లాడుతూ నాలుగు గ్రూపుల వారిని ఒకచోట సమావేశపరచి వేతనాల రేటు, మస్టర్, కొలతలు, పనిప్రదేశాల్లో సౌకర్యాలు, పనిచేసేటప్పుడు జాగ్రత్తలు, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.

10న కేన్సర్ నిర్ధారణ శిబిరం

బుట్టాయగూడెం : ఈనెల 10వ తేదీన బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం స్వచ్ఛంద సంస్థ, హైదరాబాద్‌కు చెందిన గ్రేప్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సీనియర్ న్యాయవాది, మాజీ ఎంపిటిసి ఉద్దండం ఏసుబాబు తెలిపారు. బుట్టాయిగూడెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో స్త్రీ, పురుషులలో వయసుతో నిమిత్తం లేకుండా కేన్సర్ బారిన పడుతున్నారని, ఈ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి, చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యవంతులు కావచ్చని అన్నారు. ఈ శిబిరం ప్రారంభానికి పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హాజరవుతారని, ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్లు అభివృద్ధి చేయాలని వినతి

టి.నర్సాపురం : మండల పరిధిలోని రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు టి.నర్సాపురం గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డి నాసర్ పాషా మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ పరిధిలోని టి.నర్సాపురం మండలంలోని రోడ్లు గత ఎన్నో ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వంలో మండల రోడ్లకు మహర్దశ వస్తుందని ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని, దయచేసి మండల పరిధిలోని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గత 35 ఏండ్ల క్రితం అసంపూర్తిగా నిర్మించిన టి.నర్సాపురం గండిగూడెం రోడ్డు అభివృద్ధి చేయాలని, అసంపూర్తిగా నిలిపివేసిన బంధంచర్ల రోడ్డు, అంబేద్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు సీసీ రోడ్డు వేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జనసేన మండల అధ్యక్షులు అడపా నాగరాజు, గ్రామ అధ్యక్షులు పాలెటి సత్తిబాబు, గ్రామస్తులు షేక్ అబ్బాస్, సయ్యద్ గులాబ్, షేక్ లాల్ మొహమ్మద్ పాల్గొన్నారు.

'మెగా కుటుంబానిది సేవా గుణం'

ఏలూరు సిటీ : మెగా కుటుంబం సేవా గుణం కలిగిన కుటుంబం అని ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ పుట్టినరోజును పురస్కరించుకొని రాష్ట్ర మెగా అభిమానుల ప్రేమాలయంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెడ్డి అప్పల నాయుడు, జనసేన నాయకులు నారా శేషు హాజరై ప్రారంభించారు. మెగా అభిమానులు శానం శ్రీరామకృష్ణ మూర్తి, పి.జగన్, డి.పెదబాబు, ఈదుపల్లి కాశీ పవన్, మారం అను, తాతా గోపీ, శానం ఉదయ్ సాయి, పండు నాయుడు, నాని, వివేక్ పాల్గొన్నారు.

శ్రీను కుటుంబసభ్యులకు పరామర్శ

ముసునూరు : సొసైటీ అధ్యక్షుడు మానికల శ్రీను మంచి వ్యక్తి అని మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. ముసునూరు గ్రామానికి చెందిన మానికల శ్రీనివాసరావు గత గురువారం అనారోగ్యంతో మృతిచెందడంతో ఆతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి మండల నాయకులు మానికల గంగాధరరావు, రేగుల గోపాలకృష్ణ, గుంటూరు రంగారావు, రెడ్డి తిరుపతిరావు, మానికల పండిరెడ్డి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

వృద్ధుని అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్ : అతను వృద్ధికి ఎదిగిన డాక్టర్ వయసుకి వృద్ధుడు 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించి వృద్ధికి కళంకం తెచ్చాడు. వివరికి పోలీసులు అతన్ని 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఏలూరు రూరల్ పరిధిలో ఏళ్ల రత్న ప్రసాద్(56) స్థానికంగా ఆర్‌ఎంపి డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటికి అతిసమీపంలో 8 ఏళ్ల బాలిక తల్లిదండ్రులతో కలిసి నివాసము ఉంటూ స్థానికంగా ఉన్న పాఠశాలలో మూడో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనలో ఆర్‌ఎంపి డాక్టర్ పై పోక్సో కేసు నమోదైంది. 24 గంటల గడవక ముందే రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

డబ్బు అపహరించిన దొంగల ముఠా అరెస్ట్

ఏలూరు స్పోర్ట్స్ : బ్యాంకుల వద్ద కాపలాకాస్తు డబ్బులు తీసిన వారిని వెంబడిస్తూ వారు ఆదమరుపుగా ఉన్న సమయంలో వారి వద్ద నుంచి డబ్బులు దొంగలిస్తూ, డబ్బులు లేని వాళ్ల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని ఆపి వారి వద్ద నగదును దోచుకుంటున్న ఇద్దరు సభ్యుల ముఠాను ఏలూరు మూడో పట్టణ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి వారి నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ వివరాలు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా చేసి వాటిని డిక్కీలో దాచుకుని వెళ్తు మార్గమధ్యంలో ఒక పని నిమిత్తం ఆగిన వ్యక్తి అతను డిక్కీలో దాచిన సొమ్మును అపహరించుకుపోయారు. మరో కేసులో బైక్ పై వెళ్తూ ఆగి ఉన్న వ్యక్తి నుంచి సొమ్ము దోచుకున్నారు. ఈ రెండు ఘటనలపై ఏలూరు మూడో పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఏలూరు సిసిఎస్ సిఐ రాజశేఖర్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సీసీ కెమెరాల సహాయాన్ని పోలీసులు వినియోగించారు. మంగళవారం వీరు పెదపాడు వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల సొమ్ము స్వాధీనం చేసుకోవడమే కాకుండా వారు ప్రయాణిస్తున్న పల్సర్ ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసులు అత్యంత పరిజ్ఞానాన్ని వినియోగించి వీరిని అతి తక్కువ సమయంలోనే అరెస్ట్ చేశారని తెలిపారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, సిఐ కోటేశ్వరరావు, సిఐ రాజశేఖర్, ఎస్ఐలు అప్పారావు పాల్గొన్నారు.

14 మందిపై బైండోవర్

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నవోదయం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలసానిపల్లి గ్రామానికి చెందిన 14 మంది పాత నేరస్తులను నూజివీడు తహశీల్దార్ వారి ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సంవత్సర కాల పరిమితిలో మరలా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే వారి వద్ద నుంచి లక్ష రూపాయల జరిమానా, ప్రభుత్వ పథకాలను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కొత్త పట్టిసీమలో పలుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు

పోలవరం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సర్పంచి మైగాపుల విజయదుర్గ, సచివాలయ కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న బస్‌స్టాప్ దగ్గర, కనకదుర్గమ్మ గుడి వద్ద, గూటాల పంపింగ్ స్కీమ్ వద్ద మంగళవారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వులవల వరలక్ష్మి, ఉప సర్పంచి రంభ శ్రీనివాసు, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వలవల బాలాజీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మి

ముసునూరు : పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేల్పుచర్ల అంగన్వాడీ కేంద్రం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అంగన్వాడీల ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులు మూడో నెల నుంచి 9వ నెల వరకు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? రెండు సంవత్సరాలు నిండిన బాలబాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి? అనే అంశాలపై సూచనలిచ్చారు. అంగన్వాడీలో ప్రతిఒక్కరూ సలహాలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టిఎస్ఒ పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

భీమడోలు : జాతీయ స్థాయిలో నిర్వహించిన సెకండ్ లెవెల్ ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టిఎస్ఒ) పోటీ పరీక్షల్లో పాల్గొన్న భీమడోలు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పలు అంశాలలో విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ డి.సోహిని తెలిపారు. ఈ తరహా పోటీలలో పాల్గొన్న విద్యార్థుల్లో 140 మంది వివిధ అంశాలలో విజేతలుగా నిలిచారన్నారు. దీనిలో భాగంగా వీరిలో పలువురు గోల్డ్ మెడల్‌తోపాటు పలు కన్సొలేషన్ బహుమతులను సాధించారని చెప్పారు. పరీక్షలకు పాల్గొన్న వారిలో 14 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, 78 మంది కన్సొలేషన్ బహుమతులను దక్కించుకున్నారన్నారు. పాఠశాల నుంచి ఎక్కువమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉత్తీర్ణులు కావడం వెనుక పాఠశాలలో అమలు చేస్తున్న కరిక్యులమ్ అంశం కారణంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన భార్గవ కిరణ్, ముఖేష్ బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ చింతలపూడిగా తీర్చిదిద్దాలి

ఎంఎల్ఎ సొంగారోషన్ కుమార్

చింతలపూడి : చింతలపూడిని స్వచ్ఛ చింతలపూడిగా తీర్చిదిద్దాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగారోషన్ కుమార్ అన్నారు. మండలంలోని నగర పంచాయతీలో మంగళవారం సాయంత్రం నగర పంచాయతీ కమిషనర్ పావని ఆధ్వర్యాన ఎంఎల్ఎ చేతులమీదుగా పుష్ కార్ట్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త వేయడానికి చెత్త బుట్టలను, పుష్ కార్ట్సలను ఉపయోగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పడమటిపాలెంలో బడిబాట

కలిదిండి : ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ మండలంలోని పడమటిపాలెంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం కల్పించే విశిష్టతలను వివరించారు. రాబోయే ఏడాది విద్యార్థుల ఎన్రోల్మెంట్ కరపత్రాలను ఎంఇఒ-2 వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు నున్న శ్రీనివాస్, భాస్కర వర్మ, బి.నాగరాజు, కళారి శ్రీనివాస్, అక్బర్ హుస్సేన్, కట్టా శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్వారంగాన్ని ఆదుకోవాలని వినతి

కలిదిండి: ఆక్వారంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణా రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి కోరడం జరిగిందని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. అమెరికాకు ఎగుమతయ్యే రొయ్యల ధరలు తగ్గడంతో ఆక్వారంగం కుదేలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అనే తేడా లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తింపచేయాలని కోరడం జరిగిందన్నారు. ఆక్వా రైతులు తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, పెదసింగు చంద్రరాజు పాల్గొన్నారు.

'గ్యాస్ ధర పెంపును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి'

ఏలూరు సిటీ : కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై పెంచిన 50 రూపాయలను ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం భరించాలని వైసిపి ఉభయగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏలూరులోని క్రాంతి కళ్యాణ మండపంలో ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల వైసిపి సమన్వయకర్తల ఆత్మీయ సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముందుగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తి, ఆశయాలకు అనుగుణంగా జగన్మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమ, అభివృద్ధి కోసం పనిచేశారన్నారు. రాజకీయాల్లో భయాలు ఉండవని, కేవలం పట్టుదలతోనే, ప్రజలకు మంచి చేసే లక్ష్యంతోనే పనిచేస్తామని తెలిపారు. బాబు మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని దుయ్యబెట్టారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ లారీల వేగంతో గ్రామాల్లో దుమ్ము

నివారించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు, కన్నాయగూడెం గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించిన లారీలు అతివేగంగా ప్రయాణిస్తుండటంతో ఈ రెండు గ్రామాలు దుమ్ముతో నిండిపోయాయి. కన్నాయగూడెం శివారులో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం అక్కడే ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి పొంగుటూరుకు మెటీరియల్ తరలింపు జరుగుతోంది. ఈ ప్రక్రియలో రోడ్డు సామర్థ్యాన్ని మించి నిత్యం 50 టన్నులకు పైగా లోడుతో లారీలు అతివేగంగా వెళ్తున్నాయి. గతంలో ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనం ఒత్తిడితో అధికారులు 20 కి.మీ. స్పీడ్ లిమిట్ నిబంధన విధించినప్పటికీ, గత వారం నుంచి ఈ నియమాన్ని లారీ డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. దీంతో దుమ్ము ఇళ్లల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను నిత్యం తడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బురదమయమైన రహదారి

రొయ్య రైతులపై ప్రభుత్వ వైఖరి దుర్మార్గం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు అర్బన్ : అమెరికా దిగుమతి సుంకం సాకు చూపి రొయ్యల వ్యాపారులు సిండికేట్‌గా మారి అమెరికాకు ఎగుమతి కాని రొయ్యల ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రొయ్యల రైతులు నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం అన్నే భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం అమరావతిలో జరిగిన రొయ్యల రైతులు, ఎగుమతి దారులు, వ్యాపారుల సమావేశంలో 100 కౌంట్ ధర రూ.220 కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిందని, అయితే మిగతా కౌంటల ధర ఎందుకు నిర్ణయించలేదని ప్రశ్నించారు. అమెరికాకి ఎగుమతి అయ్యే రొయ్యలు 30 కౌంటు ధర రూ.470 నుంచి రూ.410కి, 40 కౌంట్ ధర రూ.415 నుంచి రూ.350కి ధరలు తగ్గించి వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. 100 కౌంట్ ధరతో పాటు 90, 80, 70, 60, 50, 40, 30 కౌంట్ల ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రొయ్యల ఎగుమతి దారులు, వ్యాపారుల ప్రయోజనాలు తప్ప ప్రభుత్వానికి రొయ్యల రైతులను ఆదుకునే ఉద్దేశం లేనట్టుగా ఉందన్నారు. ఫీడ్ తయారు చేసే ముడి సరుకుల ధరలు తగ్గినా ఫీడ్ ధరలు ఎందుకు తగ్గించడం లేదన్నారు. నాణ్యమైన సీడ్ ఎందుకు అందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు కంటి తుడుపు చర్య మాత్రమే తప్ప రొయ్య రైతులను ఆదుకునే విధంగా లేవని చెప్పారు. ఇప్పటికైనా సరైన ధరలు నిర్ణయించి ఆ ధరల ప్రకారం ఎగుమతి దారులు, వ్యాపారులు కొనుగోలు చేసేలా తగు ఆదేశాలు జారీచేయాలని కోరారు. రొయ్యల ఉత్పత్తి ధర తగ్గించేలా ఫీడ్ ధరలు తగ్గించి, నాణ్యమైన సీడ్ అందేలా చూడాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన దిగుమతి సుంకం రద్దు అయ్యేలా కేంద్ర ప్రభుత్వం తగిన ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రొయ్యల రైతులు చేస్తున్న ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలియజేశారు.

దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలి

జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్

ఏలూరు సిటీ : ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు దోమల పట్ల, వాటి ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ సూచించారు. ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం పవర్ పేటలో జరుగుతున్న ఆశాడే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సిబ్బందికి వెక్టార్ బోర్న్ డిసీజెస్ అనగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. దోమలు పెరిగే నీటి ఆవాసాలను తొలగించాలని, లార్వా దశలోనే నాశనం చేస్తే వ్యాధుల పెరుగుదలను నియంత్రించవచ్చని సిబ్బందికి తెలియజేశారు. గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటి సర్వే జరిపి లార్వాలను గుర్తించి నాశనం చేయాలని, తద్వారా డెంగీ, మలేరియా వ్యాధిని గణనీయంగా తగ్గించవచ్చని సిబ్బంది ఆవిధంగా పనిచేయాలని సిబ్బందిని కోరారు. అనంతరం అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని, అధిక వేడిలో పని చేయరాదని సూచించారు. ద్రవ పదార్థాలు తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని, వడదెబ్బకు గురయ్యే వ్యక్తి అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, పిహెచ్ఎన్.పద్మజ కుమారి, ఆరోగ్య విస్తరణ అధికారి నల్లా అప్పారావు, హెల్త్ సూపర్వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్

కుక్కునూరు : కార్మిక వర్గ పోరాట దీక్షా దినం మేడే ప్రదర్శన, సభలలో పాల్గొనాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో మేడే జయప్రదం కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం బాడీసా సుజాత అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ కార్మికవర్గ దీక్షాదినం మేడే, కార్మికుల పోరాటానికి నిలువెత్తు సాక్ష్యం కార్మికులు సాధించిన విజయానికి ప్రతీక, నెత్తుటి దారులు కారుతున్న, ఫిరంగులు మోగుతున్న, గుండెల్లో తూటాలు దూసుకు వెళ్తున్నా ఎత్తిన జెండా దించకుండా పోరాడిన దినమే ఈ మేడే అని కొనియాడారు. అందుకనే కోట్లాది మంది కార్మిక లోకానికి పండుగ రోజు అన్నారు. రోజుకి 8 గంటల పని విధానం కోసం చికాగో కార్మికులు మే 1న ఉద్యమించి, 8 గంటల పని విధానం సాధించుకున్న సందర్భంగా మేడేను కార్మికులు చాల ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మేడే సందర్భంగా కుక్కునూరు మండల కేంద్రంలో నిర్వహించే ప్రదర్శన, సభలో కార్మికులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, కార్మికుల చట్టాల అవగాహన కోసం ఈనెల 26, 27వ తేదీల్లో దాచారంలో జరగబోయే క్లాసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సాయికిరణ్ కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు షేక్ వలిపాషా, నాయకులు మహమ్మద్ వలిపాషా, రాయి రమణ, బురం శ్రావణి, రమణ, కుమారి, కణితి మంగ, వర్స మంగ, దుర్గమ్మ, పార్వతి పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ వర్క్‌షాప్

చింతలపూడి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 7, 8 తేదీలలో 'ఆరోగ్యవంతమైన రేపటి యువత కోసం' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించగా దేశీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులు, వైద్యులు, విద్యావేత్తలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రారంభ సభలో ఆయన యువత ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వర్క్‌షాప్ కన్వీనర్, ఐక్యూఎసి డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ మిర్ హసీమ్ ఈ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. వర్క్‌షాప్ విజయవంతంగా సాగేందుకు లెఫ్టినెంట్ జిజె.మౌనికా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రముఖ పాత్ర పోషించారు. డాక్టర్ బి.సరస్వతి కో-కన్వీనర్‌గా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్ కీలకంగా సమన్వయకర్తలుగా వ్యవహరించారు. రెండు రోజుల పాటు పది సాంకేతిక సెషన్లలో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ మేధస్సు, మత్తు పదార్థాల దుర్వినియోగ నివారణ, జీవనశైలి వ్యాధులు, మాసిక ధర్మ సంబంధిత పరిశుభ్రత, శారీరక ఆరోగ్యం, డిజిటల్ ఆరోగ్య సేవలు, పోషకాహారం, ఆరోగ్య విద్య, సమగ్ర ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై చర్చలు జరిగాయి. 500 మందికిపైగా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగారోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ వర్క్‌షాప్‌లో యువతలో ఆరోగ్య అవగాహన పెంపొందించటం, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వటం, నివారణాత్మక ఆరోగ్య విధానాలు ప్రోత్సహించటం వంటి తీర్మానాలు ఆమోదించబడ్డాయి. పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

భూముల్లో అభ్యంతరాలు ఉండకూడదు

నేషనల్ హైవే డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకు జాతీయ రహదారి (365 బిబి) విస్తరణ కిచ్చే భూముల్లో అభ్యంతరాలు లేకుండా చూసుకోవాలని నేషనల్ హైవే డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని జాతీయ రహదారికి సంబంధించి కాంట్రాక్టర్లతో మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తాటియాకులగూడెం, జీలుగుమిల్లి, బర్రింకలపాడు, పి.అంకంపాలెం గ్రామాల్లో హైవేకి భూములు ఇచ్చి వెనక్కి వచ్చిన యజమానుల జాబితాను పరిశీలించారు. హైవేకు ఇచ్చిన భూములలో సరిహద్దు తగాదాలు లేకుండా, వారసత్వ భూములకు సంబంధించి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు లాంటివి లేకుండా ఉన్న భూములకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా చూసి ఫైనల్ జాబితాను అందించాలని కాంట్రాక్టర్లు రెవెన్యూ వారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, నేషనల్ హైవే ఎఇ ఖాజా బాబు, విలేజ్ సర్వేయర్ అబ్రార్ పాల్గొన్నారు.

10న పట్టెనపాలెం వంతెన నిర్మించాలని పాదయాత్ర

జయప్రదం చేయాలి : సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం

జంగారెడ్డిగూడెం : పట్టెనపాలెం వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జరిగే పాదయాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత గ్రామాల ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పట్టెనపాలెం గ్రామంలోని వంతెన బుట్టాయిగూడెం మండలం గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే ప్రధాన రహదారిగా ఉందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం గత టిడిపి ప్రభుత్వం 2014లో మంత్రి పీతల సుజాత శంకుస్థాపన చేసి, సగం పనులు చేసి నిర్మాణ పనులు ఆపేశారని నేటికీ ప్రభుత్వాలు మారినప్పటికీ ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోవడం వల్ల అకాల వర్షాలు కురిసినప్పుడు వాగు పొంగి నీరు అమాంతంగా పెరిగి, ఇప్పటికీ ఎనిమిది మంది ఈ వాగులో మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకుంటున్నారని, సిపిఎం ఆధ్వర్యాన పలుమార్లు నిరసనలు చేసి ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదన్నారు. గత సంవత్సరం నూతనంగా ఎన్నుకోబడిన టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ సొంగారోషన్ కుమార్‌కి స్వయంగా జిల్లా కార్యదర్శి ఎ.రవి నాయకత్వాన వినతి పత్రం ఇచ్చినప్పటికీ నేటికీ వంతెన నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కనీసం రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టకపోగా ప్రజాసమస్యలను గాలికి వదిలేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఈనెల 10వ తేదీ గురువారం ఉదయం 7 గంటలకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రామకృష్ణ, టి.నాగమణి నాయకత్వాన పట్టెనపాలెం వంతెన నుంచి జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఆఫీస్ వరకు 100 మందితో పాదయాత్ర జరుగుతుందని, ఈ పాదయాత్రలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం అధికారులకు వినతిని అందజేస్తామని తెలియజేశారు. ప్రభుత్వాధికారులు స్పందించకపోతే ప్రజలందరినీ ఐక్యం చేసి ప్రత్యక్ష కార్యాచరణకు, ఉద్యమాలకు దిగుతామని అధికారులను జీవరత్నం హెచ్చరించారు.

'చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఏలూరు అర్బన్ : రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శనివారపు పేట వీవర్స్ కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందినా కార్పొరేట్ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుందని, చేనేత కార్మికులు ఆకలి చావులకు, ఆత్మహత్యలకు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి వేయడంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్లో చేనేతకు కేటాయింపులు కూడా చేయలేదని విమర్శించారు. చేనేత కార్మికులను ఆకలి చావుల నుంచి రక్షించడానికి, చేనేత పరిశ్రమకు రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. గుత్తి పోతురాజు, ఎస్.విజయలక్ష్మి, ఎర్ర సాంబశివరావు, గుంటూరు సత్యవతి పాల్గొన్నారు.

'రైతులకు అండగా కూటమి ప్రభుత్వం'

చింతలపూడి : కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు రైతులకు అండగా ఉంటుందని, రైతు సేవ కేంద్రం ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా 48 గంటలలోపు ధ్యానం సేకరించి, సేకరించిన 48 గంటల్లోపు రైతులకు డబ్బులు జమ చేస్తుందని నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగారోషన్ కుమార్ అన్నారు. మండలంలోని రాఘవపురంలో ఆర్‌ఎస్‌కె వద్ద రబీ 2024-25కు గాను ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు తెలుసుకుంటూ, ఎప్పటికిప్పుడు సమస్యల పరిష్కారం చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. రైతులకు ఏ సమస్య ఉన్నా మీ దగ్గర్లో రైతు సేవ కేంద్రాన్ని, సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం చింతలపూడి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ ముత్తారెడ్డి, టిడిపి మండల ప్రెసిడెంట్ మాటూరి వెంకట రామయ్య, జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు, మండల వ్యవసాయాధికారి మీనా కుమారి, సబ్ డివిజన్ ఆఫ్ కోఆపరేటివ్ ఆఫీస్ చింతలపూడి విజయ్ కుమార్, పిఎసిఎస్ రాఘవపురం ఇన్‌ఛార్జి శ్రీనివాస్, నాగపూర్ గ్రామ ప్రెసిడెంట్ మాటూర్ అనిల్, ఆర్‌ఎస్‌కె రాఘవపురం సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

ఏలూరుస్పోర్ట్స్ : విధి నిర్వహణలో అమరులైన ఇద్దరు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులకు నియామక పత్రాలను అందించామని, వారి కుటుంబ సభ్యులకు ఎప్పుడు పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు అమరవీరుల సతీమణులకు కారుణ్య నియామకంలో నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి నేరుగా పాల్గొని ఈ పత్రాలను వారి సతీమణులకు అందించారు. ఎపిఎస్‌పి ఆరవ బెటాలియన్ మంగళగిరిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.తారకరామారావు, రాజమండ్రి ఎఆర్ విభాగంలో ఎఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.మధు కుమార్ ఈ ఏడాది అమరులయ్యారు. వీరికి ఏలూరు జిల్లా పోలీస్ యూనిట్లో ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఎస్‌పి నియామక పత్రాలను మంగళవారం అందించారు. జిల్లా అదనపు ఎస్‌పి అడ్మిన్ నక్కా సూర్యచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No. 9/2025

Between:

ఓలేటి బాలనాగమునేంద్రరావు ...పిటిషనర్

Vs

వాలూల శ్రీనివాస్ వగైరా ...రెస్పాండెంట్లు

To:

1) వాలూల శ్రీనివాస్ S/o ముత్యాలరావు
2) వాలూల పవన్‌రెడ్డి S/o శ్రీనివాస్
3) వాలూల జగదీష్ S/o శ్రీనివాస్
పెదపల్లవపాలెం, మొగల్తూరు, మొగల్తూరు మండలం
4) The officel reciver West Godhavari Dt, Eluru.

పై నెంబరు I.P పిటిషన్, పిటిషనర్, 1 to 3 రెస్పాండెంట్ల పైన దాఖలు చేసి 1వ రెస్పాండెంటును Insolvent గా తీర్మాణం చేసి 1వ రెస్పాండెంట్ 2 to 3 రెస్పాండెంట్ల పేరా వ్రాయించి ఇచ్చిన **ది. 11-12-2024 వ తేదీన** గల సెటిల్మెంటు దస్తావేజులు తాలూకు ఆస్తి 4వ రెస్పాండెంట్‌కి Vest చేయించగలందులకు కోరుచూ పై నెంబర్ పిటిషన్‌ను దాఖలు చేసినందున యావన్మందికి సదరు విషయమును తెలియచేయడమైనది. సదరు I.P **ది. 25-04-2025వ తేదీకి** వాయిదా వేసియున్నారు. కాబట్టి ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల వాయిదా రోజున అనగా **ది. 25-04-2025వ తేది ఉదయం గం॥ 10-30 ని॥లకు** కోర్టులో తెలియ పరుచుకోవలెను.

// By orders of Court //

శ్రీ గునిశెట్టి శ్రీనివాసరావు,
అడ్వకేట్, నర్సాపురం,
నర్సాపురం ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ది.07-04-25, సెల్: 95531 26234

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం. ABC-CS/006/2015

H.O. : ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521 225. Phone: 0866-6650307
B.O. : ABCCS , D.No.23B-5-96/1, R.R.Peta, ELURU-534 002, Ph: 08812-249787

ఈ ప్రకటనలోని వారి తాలూకు దిగువ ఉదహరించిన స్థిరాస్తిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖాపై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకముగా అభ్యంతరములను రిజిస్టరు పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంటు ద్వారా మా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	Smt. KASTURI SURYA KUMARI, W/o (LATE) KASTURI S R JAGADEESH GL.No. 58415 H.No. 75-6-22, FLAT No.F-5, HIMA BINDU APARTS, NEAR APEX HOSPITAL, PRAKASH NAGAR, RAJAHMUNDRY - 533101 Cell : 9010168558 /7396218366 7075945983	THE PROPERTY WHICH IS AN EXTENT OF 750.2 Sq.YDS OF HOUSE SITE ALONG WITH RCC ROOFED GROUND FLOOR RESIDENTIAL BUILDING THEREIN, IN R.S.NO. 2/3, OLD DOOR NO. 1-1, NEW DOOR NO. 1-3 ASST NO. 3, AJJAMURU VILLAGE AND PANCHAYAT, AKIVIDU (M), WEST GODAVARI DISTRICT., **Value Rs. 66,35,000/-**

Eluru
Dt.22-02-2025

NORI LAKSHMI NARASIMHAM
Branch Manager
Cell: 9281029465, 6300634609